సన్మానం



దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ను కలిసిన ఆల్విన్‌కాలనీ ఫేజ్‌ 1 నూతన కమిటీ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేజ్‌–1లో జరిగిన కాలనీ అసోసియేషన్‌ ఎన్నికల్లో గెలిచిన నూతన కమిటీ సభ్యులు సోమవారం కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌ గౌడ్‌, యువనేత రామకృష్ణ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ ఆల్విన్‌కాలనీ ఫేజ్‌ 1 సమస్యలను పరిష్కరించటంలో అందరూ కలిసికట్టుగా ఉండాలని సూచించారు. అనంతరం నూతన సభ్యులను కార్పొరేటర్‌ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో శివరాజ్‌ గౌడ్‌, పోశెట్టి గౌడ్‌, కాలనీ అసోసియేషన్‌ అధ్యక్షుడు బి. వెంకటేష్‌ గౌడ్‌, ఉపాధ్యక్షులు రాంరెడ్డి, జనరల్‌ సెక్రటరీ కుమారచారి, జాయింట్‌ సెక్రటరీ రఘు, కోశాధికారి లక్ష్మీ, కల్చరల్‌ సెక్రటరీ హేమలత, సలహాదారులు నరసింగరావు, యాదవరెడ్డి, భీష్మ కుమార్‌, మనోహర్‌, మోహన్‌రావు, మనోహర్‌ రెడ్డి, శంకర్‌, లక్ష్మయ్య, బాలరాజు, దత్తు, ఖదీర్‌ తదితరులు పాల్గొన్నారు.

పాండురంగ నగర్‌ కాలనీ అధ్యక్షుడిగా వంశీకృష్ణశర్మ ఎన్నిక



వంశీకృష్ణ శర్మను అధ్యక్షుడిగా ఎన్నుకున్న కాలనీవాసులు

మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌లోని పాండురంగ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వంశీకృష్ణ శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల దాఖలుకు ఆదివారం చివరిరోజు. గడువు ముగిసేనాటికి కేవలం వంశీకృష్ణ శర్మ ఒక్కరే నామినేషన్‌ దాఖలు చేయడంతో ఆయన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు అజయ్‌ సింగ్‌, సురేందర్‌గౌడ్‌, చంద్రరావు ప్రకటించారు. కాలనీవాసులు, స్వపక్ష, విపక్ష ప్యానెల్ల నాయకులను కలిసి ఈసారి తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని తీర్మానించి ఒక్క వంశీకృష్ణ చేత నామినేషన్‌ వేయించారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు ఉదయ్‌ కుమార్‌, ఇందర్‌సింగ్‌, రామాంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్‌, సుబ్బరాయుడు, వాసు, లలిత్‌మోహన్‌, పరిమళ, షరీఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ లేబర్‌ సెల్‌ సెక్రటరీగా గోకర్ల లక్ష్మీనారాయణ



బండి రమేష్‌ను కలిసిన గోకర్ల లక్ష్మీ నారాయణ

మూసాపేట: కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన గోకర్ల లక్ష్మీ నారాయణను టీపీసీసీ లేబర్‌ సెల్‌ ఆర్గనైజింగ్‌ సెక్రటరీగా రాష్ట్ర లేబర్‌ సెల్‌ చైర్మన్‌ ఆర్‌.ప్రకాష్‌గౌడ్‌ సోమవారం నియమించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రమేష్‌ మాట్లాడుతూ పార్టీలో చురుగ్గా పాల్గొనే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో లేబర్‌సెల్‌ రాష్ట్ర సోషల్‌ మీడియా కోఆర్డినేటర్‌ చప్పిడి భాస్కర్‌, నాయకులు శ్రీధర్‌, నయీం, దుర్గాసింగ్‌, సయ్యద్‌ బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు పెంచాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

జీడిమెట్ల: దీపక్‌నైట్రేట్‌ పరిశ్రమ యూనిట్‌–2 యాజమాన్యం వెంటనే కార్మికుల వేతనాలు పెంచాలని కుత్బుల్లాపూర్‌ మండల సీఐటీయూ నాయకులు డిమాండ్‌ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్‌, మండల కన్వీనర్‌ కీలుకాని లక్ష్మణ్‌ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్‌ రైతుబజార్‌ నుంచి పరిశ్రమ వరకు సోమవారం కార్మికులతో కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీతాలు పెంచాలని ఇప్పటికే పరిశ్రమ జనరల్‌ మేనేజర్‌కు డిమాండ్‌ నోటీసు ఇచ్చినా స్పందన లేపోగా కార్మికులకు రావాల్సిన ఇతర ఇన్సెంటివ్‌లను సైతం నిలిపివేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా మొండి వైఖరి వీడి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు పసుపుల అంజయ్య, దేవదానం, రావుల స్వాతి, ప్రసాద్‌, శ్రీను, ఖలీల్‌, షఫీ, వినయ్‌, గోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఏర్పాటు చేసిన బెంచీలను తొలగించాలి



అపార్ట్‌మెంట్‌ ఎదుట ఏర్పాటు చేసిన బెంచీలు

నిజాంపేట్‌: రోడ్డు స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన బెంచీలను తొలగించాలని కోరుతూ నిజాంపేట్‌ జర్నలిస్ట్‌ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కమిషనర్‌ సాబేర్‌ అలీకి సోమవారం ఫిర్యాదు చేశా రు. సంక్షేమ సంఘం అధ్యక్షుడు మారుతీసాగర్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ లాలయ్య, ఉపాధ్యక్షుడు వెంకట్‌ మాట్లాడుతూ.. శ్రీచైతన్య జూనియర్‌ కళాశాల ఎదుట ఉన్న లత లేక్‌వ్యూ అపార్ట్‌మెంట్‌ వాసులు సేద తీరేందుకు రోడ్డు పక్కనే బెంచీలు ఏర్పాటు చేశారని, దీంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోందన్నారు. ఈ విషయమై పలుమార్లు అపార్ట్‌మెంట్‌వాసుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. కార్పొరేషన్‌ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రత్యేక పూజలు.. అర్చనలు

ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



శ్రీగోదా రంగనాథ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు



ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శివునికి అన్నాభిషేకం



శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో...

మోతీనగర్‌: ధనుర్మాసంలో ఇల్లు శుభ్రం చేసుకొని దీపారాధన చేయటం వల్ల మహాలక్ష్మీ అనుగ్రహం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసమని దేవాదాయ ధర్మదాయశాఖ కార్యనిర్వహణాధికారి జీఏకే కృష్ణ అన్నారు. ధనుర్మాసం ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాండురంగ నగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆరాధన, సేవాకాలం, మంగళ శాసనంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోతీనగర్‌లోని శ్రీశృంగేరి శారద శంకర మఠం, శ్రీ శివరామాంజనేయ దేవాలయం, పర్వత్‌నగర్‌లోని పర్వత వర్ధిని శివాలయం, అల్లాపూర్‌ డివిజన్‌ శ్రీ వివేకానందనగర్‌లోని శ్రీ భూనీల సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు, అర్చనలు నిర్వహించారు.

శ్రీగోదా రంగనాథ స్వామి ఆలయంలో...

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్‌ చెరువుకట్ట సమీపంలో ఉన్న శ్రీగోదా రంగనాథ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 5.30 గంటల నుంచి సేవా కాలం, పాశుర విన్నపం, తీర్థ ప్రసాద గోష్ఠి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్లు



ఇలంబర్తిని కలిసిన కార్పొరేటర్లు సతీష్‌గౌడ్‌, రవీందర్‌రెడ్డి, శ్రీనివాసరావు

బాలానగర్‌: పలు డివిజన్‌లలోని సమస్యలపై సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఇలంబర్తిని ఫతేనగర్‌, బాలానగర్‌ కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ల కార్పొరేటర్లు పండాల సతీష్‌గౌడ్‌, ఆవుల రవీందర్‌రెడ్డి, మందడి శ్రీనివాసరావులు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఫతేనగర్‌ ఫ్లైవర్‌, శివాలయం వద్ద రోడ్డు అండర్‌ బ్రిడ్జి, శ్మశాన వాటికకు 2 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని సతీష్‌ గౌడ్‌ కోరారు. దీనికి సానుకూలంగా స్పందించి కమిషనర్‌ త్వరలో ఫ్లై ఓవర్‌, ఆర్‌ఓబీ ప్రాంతాలను పరిశీలించి పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇందిరాగాంధీపురం నాలాలో కొట్టుకుపోయిన బాలునికి వారికుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరారు.

సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కుత్బుల్లాపూర్‌ : సైబర్‌ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్‌ సైబర్‌ క్రైం డీసీపీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైబర్‌ నేరాలను గుర్తైతే వెంటనే హెల్ప్‌లైన్‌ నంబర్‌ 1930 లేదా సైబర్‌ క్రైం స్టేషన్‌ నంబర్‌ 9490617310 కు ఫిర్యాదు చేయాలని కోరారు. ధ్రువీకరించిన సమాచారాన్ని మాత్రమే ప్రజలు నమ్మాలని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటే సైబర్‌ నేరాల బారిన పడకుండా ఉంటామని పేర్కొన్నారు.

ఫాగింగ్‌ సక్రమంగా చేపట్టాలి

- కమిషనర్‌కు విద్యకల్పన ఏకాంత్‌గౌడ్‌ వినతి



అపూర్వ చౌహాన్‌కు వినతిపత్రం అందజేసిన విద్యకల్పన ఏకాంత్‌ గౌడ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ డివిజన్‌లో దోమల నివారణకు సరిగ్గా ఫాగింగ్‌ చేపట్టాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం రంగారెడ్డి కాంగ్రెస్‌ ఉపాధ్యక్షురాలు విద్య కల్పన ఏకాంత్‌ గౌడ్‌ కూకట్‌పల్లి జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూకట్‌పల్లి, మూసాపేట రెండు సర్కిళ్లకు ఒక్కరే ఎంటమాలజిస్ట్‌ ఫీల్డ్‌ ఆఫీస్‌ ఉండటంతో ఫాగింగ్‌పై పర్యవేక్షణలోపించిందని అన్నారు. సుమిత్ర నగర్‌లోని గోపాలకృష్ణ అపార్టుమెంట్‌ వద్ద, పీజేఆర్‌ ఫంక్షన్‌ హాలు వద్ద చెట్లు భారీగా పెరిగి చుట్టు పక్కన ఇళ్లల్లో నివసించే వారికి ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు ఏకాంత్‌ గౌడ్‌, గణేష్‌ గౌడ్‌, నియోజకవర్గం కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి ఎస్‌.పి. జితేందర్‌, డివిజన్‌ నాయకురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందుల్లేకుండా చెత్త సేకరణ



స్వచ్ఛ ఆటోడ్రైవర్లతో సమావేశమైన సబిహా బేగం

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ సబిహా బేగం సోమవారం స్వచ్ఛ ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. డివిజన్‌లోని స్వచ్ఛ ఆటోలు ప్రతీరోజు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చేయాలని సూచించారు. బండిలో చెత్త వేయకుండా రోడ్డు మీద వేసేవారి గురించి తన దృష్టికి తీసుకురావాలని ఆటోడ్రైవర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పీ సురేష్‌, రాంకీ సర్కిల్‌ ఇన్‌చార్జి సంతోష్‌, ఎస్‌ఎఫ్‌ఏలు అరుణ్‌, రవి, నాగేంద్ర, నరసింహ, వార్డు ఇన్‌చార్జి శాంతి, స్వచ్ఛ ఆటో డ్రైవర్స్‌ తదితరులు పాల్గొన్నారు.

భూదేవి హిల్స్‌లో ప్రభుత్వ భూముల సర్వే చేపట్టాలి

జగద్గిరిగుట్ట: భూదేవి హిల్స్‌లో ప్రభుత్వ భూముల సర్వే చేపట్టాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేశ్‌ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ భూమిని తమ భూమి అని చెప్పి ప్లాట్లుగా చేసి సుమరు రూ. 15 నుంచి రూ. 20 లక్షలకు అమ్ముతూ ప్రజలను మోసం చేస్తున్నారని, వెంటనే సర్వే చేపట్టి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. 2018 లో కోర్టు సర్వే చేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. స్పందించిన జాయింట్‌ కలెక్టర్‌ విజయేందర్‌ రెడ్డి వెంటనే సంబంధిత అధికారులను పిలిచి సర్వే చేసి హద్దులు తేల్చాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఉమామహేశ్‌ తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యుడు హరినాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

‘ఇందిరమ్మ’ లబ్ధిదారుల గుర్తింపు సర్వే



సర్వేను పరిశీలించిన కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌ గౌడ్‌, అధికారులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న సర్వేను సోమవారం డివిజన్‌ కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌, యువనేత రామకృష్ణగౌడ్‌, మున్సిపల్‌ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేష్‌ గౌడ్‌ మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించి అధికారులు వారి ఇళ్ల వద్దకు వెళ్లి సర్వే నిర్వహిస్తారన్నారు. సర్వే కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్‌ యాప్‌లో లబ్ధిదారుల వివరాలు పొందుపరుస్తారని పేర్కొన్నారు. సొం స్థలం ఉండి, రేకుల ఇళ్లు ఉన్న లబ్ధిదారులను ఎంపిక చేసి, స్లాబ్‌ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం తరఫు నుంచి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాండు గౌడ్‌, రామకృష్ణ, సత్యనారాయణ, ఏఎంసీకే శ్రీనివాస్‌, సర్వేయర్లు ముస్తఫా, కుమార్‌, జయలక్ష్మీ, సుమన్‌, అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌కు మంచి పేరు తీసుకురావాలి

- క్రీడాకారులకు సూచించిన ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్‌ బాలకిష్టారెడ్డి



ఫుట్‌బాల్‌ జట్టు ఎంపిక ప్రక్రియను పరిశీలించిన ప్రొఫెసర్‌ బాలకిష్టారెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో సౌత్‌ వెస్ట్‌ జోన్‌ ఫుట్‌బాల్‌ జట్టును సోమవారం ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి వైస్‌ చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ బాలకిష్టారెడ్డి పాల్గొని జట్టు ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు కావలసిన అన్ని సదుపాయాలు కల్పిస్తానని, క్రీడాకారులందరూ కలిసి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పాల్గొని పతకాలు సాధించడంతోపాటు మంచి ఉద్యోగాలు పొంది జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్‌ కౌన్సిల్‌ సెక్రటరీ ప్రొఫెసర్‌ ఎస్‌ఎస్‌ దిలీప్‌, ఫిజికల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ నల్లగొండ అశోక్‌ పాల్గొన్నారు. జట్టు ఎంపికకు చీఫ్‌ సెలక్టర్‌గా డాక్టర్‌ సయ్యద్‌ రఫీక్‌ వ్యవహరించారు. యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల నుంచి సుమారు 180 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థినులు కరాటే నేర్చుకోవాలి



కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌ తదితరులు

మూసాపేట: విద్యార్థినులు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని మూసాపేట బాలికల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌ అన్నారు. కరాటే చాంపియన్‌షిప్‌ పోటీలో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించిన విద్యార్థినులను సోమవారం అభినందించారు. చరణ్‌ సెల్ఫ్‌ డిఫెన్స్‌ మార్షల్‌ ఆర్ట్స్‌ అకాడమీ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్‌లో జరిగిన 4వ నేషనల్‌ లెవెల్‌ ఓపెన్‌ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్‌ 2024 పోటీలకు బాలికల పాఠశాల నుంచి 16 మంది, బాలుర పాఠశాల నుంచి నలుగురు హాజరయ్యారు. బాలికల పాఠశాలకు 10 బంగారు, 4 రజత, 2 కాంస్య పతకాలు, బాలుర పాఠశాలకు 2 రజత, 2 కాంస్య పతకాలు దక్కాయి. కార్యక్రమంలో కరాటే మాస్టర్‌ ప్రేమలత, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని సమతనగర్‌, జలవాయు విహార్‌, భాగ్యనగర్‌ కాలనీల్లో 64 లక్షల రూపాయలతో చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్‌ నార్నె శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గం, కాలనీల అభివృద్ధే ధ్యేయమని అన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. సమతనగర్‌ కాలనీలో రూ.22 లక్షలు, జలవాయు విహార్‌ కాలనీలో రూ.27 లక్షలు, భాగ్యనగర్‌ కాలనీలో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, కాలనీల అసోసియేషన్‌ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అన్నిమతాల పేదలకు దుస్తుల పంపిణీ ఘనత కేసీఆర్‌దే

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కేక్‌ కట్‌ చేసి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌, పాస్టర్లు తదితరులు

కూకట్‌పల్లి: అన్ని మతాలు, కులాలవారి పండగలకు దుస్తులు పంపిణీ చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బీఆర్‌ఎస్‌ క్రిస్టియన్‌ సెల్‌ అధ్యక్షుడు డేవిడ్‌ ఆధ్వర్యంలో సోమవారం కూకట్‌పల్లిలో ముందస్తు క్రిస్మస్‌ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌, పాస్టర్‌ ఐజాక్‌ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గంలోని పాస్టర్లకు ఎమ్మెల్యే సొంత నిధులతో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం ఆడపడుచులకు బతుకమ్మ చీరలు, ముస్లింలకు రంజాన్‌ తోఫా, క్రిస్మస్‌ సందర్భంగా పాస్టర్లకు బట్టల పంపిణీ చేయటం లేదని, ఇటువంటి దౌర్భాగ్యమైన ప్రభుత్వం ఉండటం మన దురదృష్టకరమని అన్నారు. నియోజకవర్గంలోని క్రిస్టియన్లకు ఏ ఆపద వచ్చినా, వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్‌ రెడ్డి, పండాల సతీష్‌ గౌడ్‌, సబిహా బేగం, శిరీష బాబూరావు, మందడి శ్రీనివాసరావు, శ్రీహరి మహేశ్వరి, రోజా రంగారావు, మాజీ కార్పొరేటర్‌ తూము శ్రావణ్‌కుమార్‌, నాయకులు సతీష్‌రావు, పి.ఐజాక్‌, పాస్టర్లు డానియల్‌, డేవిడ్‌. సువార్తమ్మ, టి. దేవానందం, రాజు, స్వామి, విజయపాల్‌, జాన్‌పాల్‌, లాల్‌బాబు, దేవదానం, సాంసన్‌, సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే చేతుల మీదుగా నూతన వస్త్రాలను అందుకున్న పాస్టర్‌ దేవానందం



కూకట్‌పల్లి నియోజకవర్గంలో ముందస్తు క్రిస్మస్‌ వేడుకల్లో పాల్గొన్న పాస్టర్లు

అయ్యప్ప స్వామి పడిపూజ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ డివిజన్‌ వెంకటేశ్వరనగర్‌లో ఎర్ర లక్ష్మయ్య నివాసంలో సోమవారం నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజా కార్యక్రమంలో వివేకానందనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి రంగారావు, జిల్లా కాంగ్రెస్‌ ఉపాధ్యక్షురాలు విద్యకల్పన ఏకాంత్‌ గౌడ్‌ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వేముల ఆంజనేయులు, బాబు, గణేష్‌ గౌడ్‌, సంపంగి యాదగిరి, మర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజలో విద్యకల్పన ఏకాంత్‌ గౌడ్‌



శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజలో కార్పొరేటర్‌ రోజాదేవి రంగారావు తదితరులు